


# రజనీకాంత్

## – గొల్లపూడి మారుతీరావు



### మారుతిరావుగారు వ్రాసిన రెండవ నవల ఇది.
### రచనాకాలం: 1960

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

"నన్ను తీసుకెళ్ళకుండా వెళ్ళిపోరు" అన్నాడు రజీ.

"నువ్వూ వెదుకు. ఎక్కడో నిద్రపోయి ఉంటారు" అని మరో కొవ్వొత్తి వెలిగించి యిచ్చాడు. నాకంతా భయంగా వుంది. అయినా తప్పక వెదికాను ఆయన్ని పేరుపెట్టి పిలుస్తూ. అలా గంటపయిగా వెదికాం. చివరికి రెండు చింత చెట్ల మధ్యకి వచ్చాన్నేను. మరో నిముషంలో కొవ్వొత్తి ఆరిపోయేటట్టుంది. అప్పటికే మా స్థలానికి చాలా దూరం వచ్చేశాను. ఆ చీకట్లో ఏవో కీచురాళ్ళ అరుపులు తప్ప యింకేం వినిపించడంలేదు. "రజీ" అని అరిచాను. ఎక్కడా అలికిడిలేదు. నా తలమీద గుడ్లగూబ అరిచింది. అంతే. కొవ్వొత్తి పట్టుకుని ఒకటే పరుగు తీశాను. పదడుగులు వేశానో లేదో దేన్నో తన్నుకుని ముందుకి పడిపోయాను. కాళ్ళకీ చేతులకీ దెబ్బలు తగిలాయి. "రజీ" అని అరిచాను గట్టిగా. ఎవ్వరూ పలకలేదు. లేవలేక అలాగే పడివుండిపోయాను చాలాసేపు. కొంతసేపటికి నన్ను వెదుక్కుంటూ రజీయే వచ్చాడు. పిల్చాడు. వాడి కొవ్వొత్తి యింకా వెలుగుతూనే వుంది.

"ఇక్కడ పడిపోయావేం?" అన్నాడు

చీకటిలో ఏదో తన్నేసుకున్నాను. భలే దెబ్బ తగిలింది."

కొవ్వొత్తి వెలుగులో 'ఏమిటా?' అని వెదికాము ఇద్దరం. వెంటనే భయంతో రజీ కెవ్వున అరిచాడు. "ఇరుగో! ఆశీర్వాదంగారు"

వెంటనే కొవ్వొత్తి నాచేతికిచ్చి గుండెమీద చెవి అనించి చూశాడు. చుట్టూ ఆకులన్నీ పోగుచేసి పెద్ద మంట వెలిగించాడు. ఆ మంటవెలుగులో ఆశీర్వాదంగారు స్పష్టంగా కనిపించారు. ఆయన భుజం మీదా, నుదురు మీదా, కడుపు మీదా పెద్ద గాయాలున్నాయి. రక్తంతో మొహమంతా తడిసిపోయింది.

ఆశీర్వాదంగారు చచ్చిపోయారు

రజీ పిచ్చెత్తినట్టు అతన్ని జాగ్రత్తగా చూస్తూ కూర్చున్నాడు. అతన్ని చంపేసి ఎక్కడ్నుంచో యీడ్చుకొచ్చి యిక్కడ పడేశారు. బహుశా తుపాకీతో కాల్చేసి వుంటారు.

నా వణుకు యిక చెప్పలేను. ముణుకుల మధ్య తల ఆనించి కూచున్నాను కొంతసేపటికి తలెత్తేసరికి రజీ ఏడుస్తూ కనిపించాడు. అంతకుముందు వాడు ఏడవడం నేనెప్పుడూ చూడలేదు.

"ఎవరు చంపేసి వుంటారంటావ్?" అన్నాను ఎంతో సేపటికి.

"ఏమో తెలీదు. తుపాకీ ఎక్కడన్నా కనిపిస్తుందేమో చూడు" అన్నాడు.

అంతటా వెదికాను. కాని ఎక్కడా ఆశీర్వాదంగారి తుపాకీ కనిపించలేదు.

"ఈయన తుపాకీ కూడా కనిపించలేదు" అన్నాడు.

ఇద్దరం అలా మంట ఆరిపోయేవరకు కూచున్నాం. రజీని ఏడవద్దని ఎన్నోసార్లు చెప్పాను. మళ్ళీ యిద్దరం మా స్థలం దగ్గరికి వచ్చేశాం. వెదగ్గా వెదగ్గా ఆయన సంచి దగ్గరే మాకో కాగితం దొరికింది.

ప్రియమైన రజీ

శత్రువులు పోలిక పట్టేశారు. నేను వెళ్ళిపోతున్నాను. సరిగ్గా ఆదివారం బెజవాడలో కలుస్తాను.

**– ఆశీ.**

"వెళ్ళిపోదామనుకుంటూంటే ఎవరో పసిగట్టి చంపేశారు" అన్నాడు రజీ.

అప్పటికి నాలుగయింది. తెల్లవారేవరకూ అక్కడే పడుకుని యింటికి వచ్చేశాను. ఈ విషయం మాత్రం ఎవరికీ చెప్పలేదు. నాలుగు రోజులవరకూ వెళ్ళనని పట్టుబట్టి బడి మానేశాను.

తర్వాత పోలీసులు లోయ తోటకి వెళ్ళారనీ, శవాన్నీ ఆ సామాన్లనీ తీసుకుపోయారనీ, రజీ అనే కుర్రాణ్ణికూడా జైల్లో పెట్టారనీ బాబాయి చెప్పాడు.

"నే చెప్పలా? వాడు వట్టి వెధవ" అన్నాడు బాబాయి.

"ఓసారి రజీని చూసివద్దాం బాబాయ్" అన్నాను. మళ్ళీ ఆ మాట అంటే చితకతంతానన్నాడు. ఇక మాట్లాడక ఊరుకున్నాను.

మరో నెలరోజులకి రజీని వదిలేశారని తెలిసింది. ఆశీర్వాదంగారిని ఏం చేశారో తెలీలేదు. రజీ మళ్ళీ ఎక్కడన్నా కనిపిస్తాడేమోనని సాయిబు కొట్టుకి వెళ్ళాను. ఎక్కడా కనిపించలేదు. ఎవ్వరూ చూడకుండా లోయతోటకి వెళ్ళాను. అక్కడా వాడు లేదు.అక్కడంతా ఖాళీగా పడివుంది స్థలం.

ఇంటికి వచ్చేశాను.

16

ఎన్నో రోజులు గడిచిపోయాయ్. బాగా వర్షాలుపడుతున్న రోజులవి. అటువంటి సమయంలో ఓనాటి సాయంకాలం వర్షంలో తడిసిపోతూ వచ్చి మా అరుగుమీద కూర్చున్నాడో కుర్రాడు. బాబాయి లోపల వంట ప్రయత్నాలు చేస్తున్నాడు. చలి బాగా వేస్తోంది. ఒళ్ళంతా ముడుచుక్కూచున్నాడు. తొంగి తొంగి లోపలికి చూస్తున్నాడు అప్పుడప్పుడు. లోపల కూచుని చదువుకుంటున్నాను నేను. బయట ఏదో అలికిడి అవడంతో అటు చూశాను.

"ఎవరదీ?"

"నేను."

"నేనంటే?"

"రజీ"

అంతే ఒక్క ఉదుటున వాడి దగ్గర పడ్డాను. "రజీ" అనరిచాను.

"బాగా చలివేస్తోంది. నీలాగూ, లాల్చీ వుంటే యివ్వు" అన్నాడు.

వెంటనే లోపలికి పరిగెత్తుకు వెళ్ళి తెచ్చి యిచ్చాను.

"ఇన్నాళ్ళూ ఎక్కడికి పోయావు?"

"ఏమో తెలీదు."

"నీకే తెలీదా?"

"చాలా వూళ్ళు తిరిగాను. ఎక్కడెక్కడ తిరిగానో జ్ఞాపకంలేదు. బందరు వెళ్ళాను ఓసారి. అక్కడ ఆశీర్వాదంగారి తమ్ముడున్నాడు. ఆశీర్వాదంగారు తెలుసుగా?"

"తెలుసు."

"తర్వాత అక్కడ్నుంచి కూడా వచ్చేశాను. దారిలో జ్వరం వచ్చేసింది."

"వొళ్ళంతా వేడిగా వుందని రైలు స్టేషన్లో చల్లటి నీళ్ళు స్నానం చేసేశాను. వెంటనే నిద్రపట్టేసింది. పడుకున్నాను. మరి నాలుగు రోజులదాకా తెలివిరాలేదు. మేలుకునేసరికి ఎవరో సాధువుల దగ్గర వున్నాను. వాళ్ళు నా వొళ్ళంతా ఏదో బూడిద పట్టించారు. మరో పదిరోజులకి తగ్గిపోయింది జ్వరం"

"తర్వాత?"

"తర్వాత యింకేమీ లేదు. యిక్కడికి వచ్చేశాను."

"మరింకెక్కడికి వెళ్ళకు" అన్నాన్నేను.

"అలాగే"

"ఆకలి వేస్తోందా?"

"ఊ"

"అయితే బాబాయితో చెప్పి వస్తానుండు"

"నేనంటే కోపగిస్తాడేమో?"

"పర్వాలేదులే నేను చెప్తాను" అంటూ లోపలికి వెళ్ళాను.

బాబాయితో చెప్పాను. అట్టే యిష్టంలేకపోయినా అంతా విన్నాక "సరే లోపలికి రమ్మను" అన్నాడు. ఆ గదిలోనే రజీకి పక్క వేశాను.

మరో పదిరోజులు మాత్రం అక్కడ ఉన్నాడు వాడు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే లోయతోటలోకి వెళ్ళిపోయాడు. సాయిబు దగ్గర టోపీలు కుట్టడం ప్రరంభించాడు. మరికొన్నాళ్ళ వరకూ గంతులేవీ చెయ్యకుండానే గడిపేశాం. అప్పుడప్పుడు వాడిని కలుసుకునేవాడిని. ఆ మాటా యీ మాటా చెప్పుకునే వాళ్ళం. తర్వాత వాడు తోటలోకి పోయేవాడు.

ఆ యేడూ నిర్మలా, నేనూ పరీక్ష ప్యాసయ్యాము. ఈ సంగతి యిద్దరం కలిసి వెళ్ళి రజీతో చెప్పాం. మర్నాడు మా యిద్దరికీ వాడూ రెండు ఏపిల్ పళ్ళు తెచ్చి యిచ్చాడు.

ఏది ఎలావున్నా రజీ స్థిరంగా ఉండలేకపోయాడు. కొన్నాళ్ళు ఎవరో సాధువుని తెచ్చి వాడిని తోటలో వుంచి భోజనం పెడుతూండేవాడు. నన్ను కూడా అక్కడికి రమ్మన్నాడు. ఏదో ఉపదేశాలు చేసానన్నాడు. ఆ సాధువు దగ్గర మంత్రాలు కూడా ఉన్నాయట.

నేను మాత్రం వెళ్ళలేదు. ఆ సాధువు మొహం చూడగానే నాకు అనుమానం వేసింది. సాధువుల్లో సాధారణంగా దొంగ సాధువులుంటారని బాబాయి చెప్పాడు. అందుచేత నేనటువేపు వెళ్ళలేదు. తర్వాత ఓనాడు రజీ దాచుకున్న డబ్బు పట్టుకు పారిపోయాడని తెలిసింది. నేననుకున్నది నిజమేననిపించింది.

మరికొన్నాళ్ళు చిలకని పెంచాడు రజీ. దానికి మాటలు నేర్పేవాడు. భుజం మీద వుంచుకుని ఊరంతా తిరిగేవాడు. దాని కాళ్ళకి యిత్తడి కడియాలు తొడిగాడు. చక్కని పంజరం చేయించాడు. రాత్రీ పగలూ దాన్ని వదిలేవాడు కాదు. కాని ఓ రోజువాడు సాయిబు కొట్లో టోపీలు కుడుతూండగా ఓ పిల్లి దాన్ని మింగి ఊరుకుంది. అక్కడితో చిలక కథ అయిపోయింది. ఆ పిల్లిని రజీ ఎన్ని తిప్పలు పెట్టాడో చెప్పలేను.

ఈసారి పాలపిట్టను పెంచాడు. అదీ ఎగిరిపోయింది కొన్నాళ్ళు ఉన్నట్టే వుండి.

ఓ రోజు ఉదయమే నా దగ్గరికి వచ్చాడు వాడు.

"రెండు రూపాయలుంటే కావాలిరా" అన్నాడు.

"ఎందుకూ?"

"కావాలి"

"నాతో  చెప్పకూడదా?"

"నూజివీడు దగ్గర చాలా యిళ్ళు కాలిపోయాయిట. ఇల్లు లేక చాలామంది ఏడుస్తున్నారు."

"అయితే?"

"వాళ్ళకి సహాయం చెయ్యాలి."

"ఈ రెండు రూపాయలతో యింత చిన్నవాడివి నువ్వేం సహాయం చేస్తావ్?"

"చిన్నవాళ్ళు సహాయం చెయ్యలేరా యేమిటి?"

"హాయిగా యిక్కడే వుండు. ఎక్కడికీ వెళ్ళకు"

"వెళ్ళి తీరాలి. నీకు తెలీదు. ఉంటే రెండు రూపాయలు యివ్వు."

చివరికి ఎలాగో సంపాయించి రెండు రూపాయలు యిచ్చాను.

"ఇది అప్పుకాదు" అన్నాడు.

"సరేలే"

"నీలాంటి స్నేహితుడు నాకెప్పుడూ దొరకదురా" అన్నాడు. ఇద్దరం ఒకరినొకరం విచిత్రంగా చూసుకున్నాం. అంతే. వెనక్కి తిరిగి చూడకుండా పారిపోయాడు రజీ. వాడు కనిపించేవరకూ అలానే చూస్తూ నిలబడ్డాను.

17

మరి ఎన్నాళ్ళయినా తిరిగిరాలేదు రజీ. నేను గాభరా పడ్డాను. రోజూ వాడికోసం ఎదురు చూసేవాణ్ణి. అప్పుడప్పుడు లోయతోటకి పోయి చూసేవాణ్ణి. కాని వాడు కనిపించలేదు. లోయతోట ఎవరికో కౌలుకి ఇచ్చేశారు. ఇప్పుడక్కడ పొలాలూ, విరిగిన చెట్లూ మిగిలాయి.

రెండేళ్ళు గడిచిపోయాయి. నేను పెద్దవాణ్ణయాను. క్రమంగా రజీని ఆ వూళ్ళో అంతా మరిచిపోయారు. కాని సాయంకాలం ఆ పడవ చూసినప్పుడూ, ఆ లోయతోటకి వెళ్ళినప్పుడూ రజీ జ్ఞాపకం వచ్చేవాడు. ఒక్కోరోజు వాడికోసం గంటలతరబడి ఆలోచిస్తూ అలానే పడవదగ్గర కూర్చునే వాణ్ణి.

నాతోపాటు వాడిని మర్చిపోని వ్యక్తి మరొకరున్నారు. నిర్మల. ఇద్దరం మామిడితోటలో కూచుని రజీ విషయాలు చెప్పుకునేవాళ్ళం.

చీకటిపడగానే ఇళ్ళు చేరేవాళ్ళం.

కొన్నాళ్ళకి నిర్మలని చదివించడం మానేశారు. ఎప్పుడూ ఆమె ఇంట్లోనే ఉండిపోయేది. ఎప్పుడన్నా వీధిలోంచి పోతూంటే గుమ్మంలో కనిపించేది. కనిపించినప్పుడల్లా పలకరించి ఏదో మాట్లాడేది.

కిష్టుడూ, రాం, రాజీ, కన్నా అంతా విడిపోయాం. కొందరు యీ ఊరు నుంచి వెళ్ళిపోయారు.

నేనుమాత్రం ఆ రోడ్ల వెంట తిరుగుతూ చిన్నతనాన్ని జ్ఞాపకం చేసుకుంటూ ఉండేవాడిని.

క్రమంగా బాబాయి నీరసించిపోయాడు. అతనికి గుండె జబ్బు చేసింది. రోజు రోజుకూ అధికమయింది. గాలిమార్పు కోసం మరోవూరు వెళ్ళవలసి వచ్చింది.

చివరిసారిగా నిర్మలని కలుసుకుని మాట్లాడాను. ఆనాటి సాయంకాలమే బాబాయితో రైలెక్కి పోయాను.

రైల్లో కూర్చున్నంతసేపూ ఎన్ని విషయాలు జ్ఞాపకం వచ్చాయో చెప్పలేను. మా ఆటలూ, ఆశీర్వాదంగారూ, సర్కసూ, నాటకం విషయం – అన్నీను.

రైలు దిగేసరికి బాగా చీకటి పడింది. ఆ స్టేషన్లో అట్టేమంది మనుషులు దిగలేదు. బాబాయి ముందు నడుస్తున్నాడు. నిద్దర మత్తులో తొందర తొందరగా అడుగులు వేస్తున్నాను. ఆ తొందరలోనే రోడ్డు ప్రక్కన పడుకున్న ముష్టివాడి కాలు తొక్కేశాను. 'అమ్మా' అని మూలిగాడు వాడు. నా మనస్సు చివుక్కుమంది.

"ఏంకావాలిరా నీకు?" అన్నాను.

"నీళ్ళు – మంచినీళ్ళు పొయ్ తమ్ముడూ" ఆగి ఆగి అడిగాడు.

ముందుపోతున్న బాబాయిని పిలిచాను.

"ఆ ముష్టివాడికి మంచినీళ్ళు కావాలిట బాబాయ్"

"పోనిద్దూ వెధవలు. టక్కరి వేషాలు వేస్తారు" అని విసుక్కున్నాడు.

వాణ్ణి విడిచిపెట్టి పోబుద్ధి వెయ్యలేదు నాకు.

"నేను పోసి, వస్తాను" అంటూ బాబాయి చేతిలో చెంబు తీసుకుని వెనక్కి వచ్చాను.

ముష్టివాడి తలెత్తి నోట్లో నీళ్ళు పొయ్యబోయాను. కళ్ళు విప్పాడు వాడు. వాణ్ణి ఆ వెలుగులో చూసి దిగ్భ్రాంతుడ్నయాను. వాడు నన్ను చూసి ఏదో అన్నాడు.

వాణ్ణి మరీ దగ్గరగా గమనించాను. వాడి తల నా చేతిలోంచి మెల్లగా జారిపోయింది.

నేను పరిగెత్తి బాబాయి దగ్గరికి వచ్చాను.

నాకు ఊపిరి ఆడడంలేదు. మాటలు తడబడ్డాయి మెల్లగా వినిపించీ వినిపించనట్టు అన్నాను.

"రజీ చచ్చిపోయాడు బాబాయ్."

**(సమాప్తం)**

Post your comments